సాక్షి
వికారాబాద్

శనివారం । 17 । జూన్ । 2023



నాణ్యత డొల్ల.. నిధులు గుల్ల

రూ.కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా తాండూరు నియోజకవర్గంలో రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. 8లో▸



ప్రగతి పరుగులు

ప్రత్యేక రాష్ట్రంలో మున్సిపాలిటీలు ప్రగతి బాటపట్టాయని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. 8లో▸



ఇది అంగన్‌వాడీ గుడ్డు!

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం, విద్య బలోపేతమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల సమాచారం

వికారాబాద్ అర్బన్: జిల్లా ఎన్నికల సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పొందవచ్చునని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వెబ్ సైట్లను అనుసరించాలని సూచించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వికారాబాద్ జిల్లాకు సంబంధించిన ఎన్నికల సమాచారాన్ని తెలుసుకునేందుకు http://www.facebook.com/DEOVIKAQABAD, ట్విట్టర్, @DEOVIKAQABAD, ఇన్‌స్టాగ్రామ్, doevikarabad, వెబ్‌సైట్ www.vikarabad. teanfana. gov.in ద్వారా తమ మొబైల్‌లో నేరుగా తాజా ఎన్నికల సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల విక్రయ వేలం

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మండలంలోని ఆలంపల్లి గ్రామ రెవెన్యూలోని 15 ఎకరాల భూమిని వేలం పాటలో విక్రయించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న మొదటి బిడ్డింగ్, జూలై 1న రెండో బిడ్డింగ్ సమర్పించాలని, జూలై 13న వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే యాలాల మండలం మనోహర టౌన్షిప్‌లోని 14 ప్లాట్లు, 54 ఇళ్లు, తాండూరు మండలం అల్లాపూర్ సర్వే నంబర్ 109లోని 26 ఎకరాల భూములకు వేలం పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఈనెల 24న మొదటి బిడ్డింగ్, జూలై 1న రెండో బిడ్డింగ్.. 11న వేలం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు.

పాలనా వికేంద్రీకరణతోనే మెరుగైన సేవలు

హుడాకాంప్లెక్స్: పరిపాలన వికేంద్రీకరణతోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం సాధ్య మని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అభిప్రాయపడ్డారు. సరూర్‌నగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి సరూర్‌నగర్ వార్డు (19) కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పౌర సేవలను మరింత వేగవంతం చేసేందుకే ప్రభుత్వం వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. వార్డు కార్యాలయానికి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, పది మంది అధికారుల బృందం వివిధ శాఖల నుంచి పనిచేస్తారని అన్నారు. అధికారులను నియమించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలు, నర్సరీలు, పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసుకొని పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే 50 ఏళ్లలో తాగునీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించారని తెలిపారు.



కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న చీమల్దరి సర్పంచ్ నర్సింహారెడ్డి



తాండూరు రూరల్: ఐఎస్ఓ అవార్డుతో కరన్‌కోట్ సర్పంచ్ వీణాహేమంత్ తదితరులు



సర్టిఫికెట్ అందుకుంటున్న నవాబుపేట మండలం ఎల్లకొండ సర్పంచ్ తదితరులు



వికారాబాద్ మండలం పులుమద్ది సర్పంచ్, అధికారులు తదితరులు

ఐఎస్ఓ 4

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. జిల్లాలో ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) గుర్తింపు పొందిన నాలుగు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులను శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నారాయణ అమిత్, డీపీఓ తరుణ్ కుమార్, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. – వికారాబాద్ అర్బన్

గులాబీకి ఎదురుదెబ్బ

బీఆర్ఎస్‌ను వీడేందుకు గురునాథ్‌రెడ్డి నిర్ణయం

- స్వయంగా వెళ్లి ఆహ్వానించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరేందుకు మాజీ ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్
- కొడంగల్‌లో మారనున్న రాజకీయ సమీకరణాలు



వికారాబాద్/కొడంగల్: కొడంగల్‌లో మంచి ఊపుమీదున్న గులాబీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు సిద్ధమయ్యారు. శనివారం లేదా ఆదివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరేందుకు మహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి చిన్నారెడ్డితో కలిసి స్వయంగా హైదరాబాద్‌లోని గురునాథ్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు.

చాన్నాళ్లుగా అంటీముట్టనట్లు

గత ఫిబ్రవరి నుంచే గురునాథ్‌రెడ్డి బీఆర్ఎస్‌కు అంటీముట్టనట్లు ఉంటున్నారు. మండలాల వారీగా తరచూ తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ సమయంలో కేటీఆర్ నుంచి కబురు అందడంతో తన నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఆతర్వాత అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాకపోడం.. పీసీసీ అధ్యక్షుడు నేరుగా తన ఇంటికి వచ్చి ఆహ్వానించటంతో పార్టీ మారేందుకు రెడీ అయిపోయారు. దీంతో ఓ సీనియర్ నేతతో పాటు కొడగంల్ మున్సిపాలిటీ, మండల పరిషత్ అధికార పార్టీ చేజారనుంది.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా..

ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఉమ్మడి రాష్ట్రంలో ఓసారి వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ గడ్డపై గురునాథ్‌రెడ్డి రాజకీయ ప్రాభవం అందరికీ తెలిసిందే. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, 2014లో బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగి రేవంత్‌రెడ్డి చేతిలో అనూహ్య పరాజయం పొందారు. దీంతో కొడంగల్ గడ్డపై రేవంత్ రెడ్డిని ఎలాగైనా ఓడించి, పైచేయి సాధించాలనే వ్యూహంలో భాగంగా అధికార పార్టీ 'ఆపరేషన్ కొడంగల్' చేపట్టింది. ఈక్రమంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం ఫ్యామిలీ నుంచి నరేందర్‌రెడ్డిని రంగంలోకి దింపింది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావ్ కొడంగల్‌లో ప్రచార బాధ్యతలు చేపట్టి.. రేవంత్‌ను ఓడించడం ద్వారా అనుకున్నది సాధించారు. అయితే ఒక్క చాన్స్ అంటూ కొడంగల్‌కు వచ్చిన పట్నం నరేందర్‌రెడ్డి అక్కడే పాతుకుపోవడంతో..గురునాథ్‌రెడ్డి కుటుంబానికి రాజకీయ ప్రాధాన్యం తగ్గింది.ఈసమయంలో కాంగ్రెస్ గూటికి చేరడం ద్వారా తమ గత వైభవాన్ని తిరిగి సాధించుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఇందుకు రేవంత్ సహకారం తోడవడంతో రెండో ఆలోచన చేయకుండా పార్టీ మారేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు.

అధికార పార్టీ విస్మరించినందుకే..

రేవంత్‌ను ఎలాగైనా ఓడించాలని గట్టిగా నిర్ణయించుకున్న అధికార పార్టీ అప్పట్లో నరేందర్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. అయితే ఈసారి సిట్టింగులకే టికెట్లు అని గులాబీ బాస్ కేసీఆర్ పలుమార్లు ప్రస్తావించడంతో.. తమ పరిస్థితి ఏమిటని గురునాథ్‌రెడ్డి డైలమాలో పడ్డారు. గతంలో డీసీసీబీ చైర్మన్ పదవి ఆశించినా భంగపాటు ఎదురవడంతో పార్టీ తనను విస్మరిస్తోందని నిర్ణయించుకున్నారు. ఈసారి కొడంగల్ టికెట్‌ను తన కుమారుడు జగదీశ్‌రెడ్డికి ఇస్తేనే



పార్టీలో కొనసాగుతానని అనేకసార్లు చెప్పు కొచ్చారు. కానీ ఆ పరిస్థితులు కనిపించకపోవంతో తన కుమారులతో కలిసి కాంగ్రెస్ జెండా పట్టుకునేందుకు సిద్ధమయ్యారు.

కలిసి రాని కాలం

ముప్పై ఏళ్ల పాటు తన కను సైగలతో కొడంగల్‌ను శాసించిన గురునాథ్‌రెడ్డికి కొంతకాలంగా పాలిటిక్స్ కలిసి రావడం లేదు. పలుకుబడి, అనుచరగణం ఉన్న ఆయన వెంట నడిచేందుకు నియోజకవర్గంలోని చాలా మంది ద్వితీయ శ్రేణి నాయకులు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయనకు అండగా నిలిచి.. ఈ మధ్యకాలంలో దూరమైన వారు సైతం తిరిగి వస్తారని ఆయన భావిస్తున్నారు.

కాంగ్రెస్ భరోసా

కాంగ్రెస్‌లో గురునాథ్‌రెడ్డికి సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ భరోసా ఇచ్చినట్లు సమాచారం. తన పలుకుబడికి.. ప్రాభల్యం.. అధికారానికి భంగం కలిగిందని భావించిన గురునాథ్‌రెడ్డి ఈసారి ఏ నిర్ణయం తీసుకుంటారోనని చాలా కాలంగా చర్చ సాగుతోంది. ఐదుసార్లు కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన రెండు సార్లు హ్యాట్రిక్ మిస్సయ్యారు. 2018లో టీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు.

ఎవరికి లాభం..?

గురునాథ్‌రెడ్డి పార్టీ మారితే ఎవరికి లాభం..? ఎవరికి నష్టం..? అనే అంశంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఆయన పార్టీ మారడం ద్వారా బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని ఎక్కువ శాతం మంది భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్ తరఫున ఇక్కడి నుంచి గురునాథ్‌రెడ్డి పోటీ చేస్తారా..? తన తనయుడికి టికెట్ అడుగుతారా..? లేదా రేవంత్‌కు మద్దతుగా ప్రచారం చేస్తారా..? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.



వికారాబాద్‌లోని గరీబ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

ఇష్టంగా తినేలా..

- అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు లబ్ధి

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: **1,107**	
మూడేళ్లలోపు చిన్నారులు: **33,003**	
మూడు నుంచి ఆరేళ్లలోపు వారు: **5,940**	
గర్భిణులు: **6,195**	
బాలింతలు: **5,804**	

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మూడేళ్లుగా సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వం, ఇక మీదట అంగన్‌వాడీ చిన్నారులకు కూడా వీటినే అందించాలని నిర్ణయించింది. దొడ్డు బియ్యంతో కూడిన భోజనం తినేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు విముఖత చూపుతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని సన్నబియ్యం సరఫరాలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని అంగన్‌వాడీల్లో చదివే వేలాది మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మేలు చేకూరనుంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మూడు నుంచి ఐదేళ్ల చిన్నారులకు నిత్యం 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఒక గుడ్డు (ఉడికించినది), 5 గ్రాముల నూనెతో చేసిన ఆహారం, 50 గ్రాముల బాలామృతం, 20 గ్రాముల మురుకులు అందజేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు ప్రతినెలా 16 గుడ్లు ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద రోజుకు 150 గ్రాముల బియ్యం, 200 మిల్లీలీటర్ల పాలు, 30గ్రాముల కందిపప్పు అందిస్తున్నారు. మిగిలిన పోషకాహారం బాగానే ఉన్నా దొడ్డు బియ్యంతో కూడిన అన్నం వడ్డిస్తుండటంతో తినడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో తమవంతు కోటాగా వస్తున్న గుడ్లు, పాలు, ఇతర ఆహార పదార్థాలను ఇంటికి తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసే అవకాశం ఉంది. సన్న బియ్యంతో అన్నం వడ్డించే కార్యక్రమాన్ని త్వరగా అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కో కేంద్రానికి సగటున 70 నుంచి 75 కిలోల వరకు సన్న బియ్యం సరఫరా కానున్నాయి.

మహిళల హక్కులపై నిరంతర పోరాటం

అనంతగిరి: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళా హక్కుల పరిరక్షణ కోసం ఐద్వా ముందుండి పోరాటం చేస్తోందన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ, ఆశ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, మల్లేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ జ్యోతి

నూతన కమిటీ..

ఐద్వా జిల్లా నూతన అధ్యక్షురాలిగా అనసూయ, ఉపాధ్యక్షులుగా సునిత, అంతమ్మ భారతమ్మ, ప్రధాన కార్యదర్శిగా నిర్మల, సహకార్యదర్శిగా నరసమ్మ, లక్ష్మితో పాటు మరో 14 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేసును ఎత్తివేయాలి

షాద్‌నగర్: ప్రొఫెసర్ హరగోపాల్‌పై పెట్టిన దేశ ద్రోహం కేసును వెంటనే ఎత్తివేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ హరగోపాల్‌పై తాడ్వాయి పీఎస్‌లో నమోదు చేయడం సరికాదన్నారు.

దారి తప్పుతున్న దర్యాప్తు!

- కీలక కేసుల్లో విచారణాధికారుల నిర్లక్ష్యం
- వాస్తవాలను దాచి.. నీరుగారుస్తున్న వైనం
- ప్రభుత్వ శాఖలపై విశ్వాసం కోల్పోతున్న ప్రజలు
- కొంతమంది అధికారుల తీరుతోనే ఈ దుస్థితి

వికారాబాద్: సంచలనం రేపుతున్న పలు కీలక కేసుల్లో పోలీసులు, వైద్యాధికారులు వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలు, విమర్శలు, ఆరోపణలకు తావిస్తోంది. నేర నిర్ధారణలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఆయా శాఖలు.. ప్రజలు, సమాజానికి తప్పుడు సమాచారం ఇస్తున్నాయనే చర్చ సాగుతోంది. ఇలాంటి వ్యవహార శైలిని అనుసరిస్తున్న కొంతమంది తాము పనిచేస్తున్న శాఖలకు మచ్చ తేవడంతో పాటు జనాల్లోనూ చులకనవుతున్నారనేది నిర్వివాదాంశం.

కిరాతకంగా చంపినా..

ఇటీవల కాళ్లాపూర్‌లో జరిగిన పారా మెడికల్ విద్యార్థి శిరీష హత్యోదంతం ఘటనలో పోలీసులు, వైద్యులు అనుసరించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. యువతిది ముమ్మాటికీ హత్యేనని ప్రధాన వార్తా పత్రికలు, టీవీ చానళ్లు ఘంటాపథంగా చెప్పాయి. మృతురాలి శరీరంపై కనిపించిన గాయాలను చూసిన ప్రతిఒక్కరూ ఆమెను కిరాతకంగా హత్య చేశారని కన్నీరు పెట్టుకున్నారు. కానీ పోలీసులు, వైద్యులు మాత్రం మొదట నామమాత్రపు దర్యాప్తు చేసి ఆత్మహత్యగానే భావిస్తున్నట్లు చెప్పడం గమనార్హం. ఇది విన్న ప్రతిఒక్కరూ ముక్కున వేలేసుకున్నారు. శిరీష మృతి కేసులో ప్రధాన నిందితుడైన ఆమె బావ అనిల్‌తో పాటు తండ్రి, తమ్ముడిని విచారించిన పోలీసులు మెతక వైఖరిని అవలంబించారనే ఆరోపణలు చెలరేగాయి. అభంశుభం తెలియని యువతి మృతికి కుటుంబ సభ్యులే కారణమంటూ గ్రామస్తులు శిరీష ఇంటి వద్ద ఆందోళన చేసినా పోలీసులు మాత్రం నాన్చుడు ధోరణినే కొనసాగించారు. పైగా కేసును దర్యాప్తు చేస్తున్నాం.. పోస్టుమార్టం రిపోర్ట్ రావాలి అంటూ నిజాలను దాచే ప్రయత్నమే చేశారు.

ఆత్మహత్యగా ప్రకటన

గ్రామ శివారులోని నీటి కుంటలో కనిపించిన శిరీష మృతదేహాన్ని బయటకు తీసిన అనంతరం పోస్టు



మార్టం నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరుసటి రోజు ఉదయాన్నే వికారాబాద్ నుంచి వచ్చిన వైద్యులు మరోసారి శవ పంచనామా నిర్వహించారు. ఈ సమయంలోనూ కళ్లు, ముఖం, శరీర భాగాలపై తీవ్రమైన గాయాలు స్పష్టంగా కనిపించాయి. దీనికి తోడు మోకాళ్లలోతు కూడా లేని నీటి కుంటలో పడితే ఎలా చనిపోతారని గ్రామస్తులు నిలదీశారు. పోస్టుమార్టం, రెండోసారి పంచనామా అనంతరం కూడా శిరీషది ఆత్మహత్యేనంటూ వైద్యులు పేర్కొనడం గమనార్హం. ఈ విషయాలను విన్న వారు పోలీసులు, వైద్యుల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అయితే ఓ శాఖకు చెందిన అధికారులు వైద్యులను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారనే ఆరోపణలు కూడా వినిపించాయి. మీడియాలో ఈ వ్యవహారమంతా హైలైట్ కావడంతో జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. కేసును సుమోటోగా స్వీకరిస్తూ దర్యాప్తును పారదర్శకంగా నిర్వహించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో దిద్దుబాటు చర్యలు చేపట్టిన సంబంధిత అధికారులు ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తేనే పూర్తి వాస్తవాలు తేలిసే అవకాశం ఉందని.. తమ చేతులకు మట్టి అంటుకోకుండా జాగ్రత్త పడే ప్రయత్నాలు చేశారు. మరుసటి రోజే శిరీషది ఆత్మహత్య కాదు.. హత్య అని.. తన కామవాంఛ తీర్చలేదనే అక్కసుతో ఆమె బావే బీరు సీసాతో దాడిచేశాడని, కళ్లలో పొడిచి.. నీళ్లలో ముంచడంతో ఊపిరాడక శిరీష మృతిచెందిందని వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కానీ విచారణ సమయంలో పోలీసులు, వైద్యులు పారదర్శకంగా వ్యవహరించలేదని, కేసు మరింత జఠిలం అవుతుందని గుర్తించి వాస్తవాలు వెల్లడించారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

మరిన్ని అనుమానాలు..

అయితే ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. శిరీషపై లైంగిక దాడికి ప్రయత్నించడంతో తీవ్రంగా ప్రతిఘటించి ఉంటుందని, హత్య సమయంలో అనిల్‌తో పాటు మరికొంత మంది కూడా అక్కడ ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలు ఈ కేసు విషయంలో పోలీసులు, వైద్యులను ఎవరో ప్రభావితం చేశారనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

చేసిందే విచారణ..

- నెల రోజుల క్రితం అంతారం లో నర్సింహులు అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మృతిచెందాడు. తన భర్తను కొంతమంది హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. శరీరంపై గాయాలు కూడా కనిపించినా పోలీసులు పక్షపాతం చూపుతున్నారని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఇవేవీ పట్టించుకోకుండా.. ముళ్ల పొదల్లోంచి వెళ్లడం వలన శరీరంపై గీతలు పడి ఉంటాయని, అది ముమ్మాటికీ ఆత్మహత్యేనని పోలీసులు విచారణ ముగించారు.

కంది పప్పు @ రూ.15,000

- రోజురోజుకూ పెరుగుతున్న ధర
- రిటైల్ మార్కెట్లో కిలో రూ.170
- దిగుబడులు తగ్గడంతో ఫుల్ డిమాండ్
- ఆందోళనలో వినియోగదారులు

తాండూరు: కందిపప్పు ధర చుక్కలనంటుతోంది. ఆరు నెలలుగా పైపైకి ఎగబాకుతోంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పదిహేను రోజులుగా క్వింటాలుకు రూ.15 వేలు తగ్గకుండా రికార్డు సృష్టిస్తోంది. దేశంలోనే తాండూరు కందిపప్పుకు మంచి గుర్తింపు ఉంది. గతేడాది దీనికి భౌగోళిక గుర్తింపు సైతం లభించింది. ఇందుకు అనుగుణంగా అధికారులు పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలేవీ తీసుకోకపోవడం లేదు. రెండేళ్లుగా ఉత్పత్తులు భారీగా పడిపోవడంతో పప్పు ధర పైపైకి వెళ్తోందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

భారీ వర్షాలతో తగ్గిన దిగుబడి

జిల్లాలో గతేడాది 1.60 లక్షల ఎకరాల్లో రైతులు కంది సాగు చేశారు. గతేడాది డిసెంబర్ నెల నుంచి పంట ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. సీజన్



ప్రారంభమైన తొలినాళ్లలో క్వింటాలు కందుల ధర రూ.5,500నుంచి రూ.6,500 పలికింది. ఏప్రిల్ వచ్చేసరికి రూ.10,200 చేరింది. ప్రస్తుతం తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు కందుల గరిష్ఠ ధర రూ.10,331, కనిష్ఠ ధర రూ.9,659, సగటున రూ.10,100 పలుకుతోంది. గతేడాది వానాకాలంలో సాగు చేసిన కంది పంట విస్తీర్ణం ప్రకారం జిల్లాలో సుమారు 8లక్షల క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ భారీ వర్షాలకు చేలు పాడవడంతో ఉత్పత్తులు చేతికందలేదు.

జనవరిలో క్వింటా రూ.11 వేలు

కందుల సీజన్ ప్రారంభం నుంచే జిల్లాలోని హోల్‌సెల్ మార్కెట్‌లో కంది పప్పునకు అధిక ధర పలుకుతోంది. జనవరిలో రూ.11వేలు ఉండగా తర్వాత రోజుల్లో రూ.12,500 వరకు చేరింది. ప్రస్తుతం క్వింటాలు కందిపప్పు ధర రూ.15 వేలకు చేరింది. మరోవైపు రిటైల్ మార్కెట్‌లో కిలోకు రూ.160 నుంచి రూ.170 వరకు విక్రయిస్తున్నారు.

ఏడేళ్ల తర్వాత

కందిపప్పు ధరలు ఏడేళ్ల తర్వాత మళ్లీ గరిష్ఠ స్థాయికి చేరాయి. 2015 నుంచి 2016 మధ్యలో క్వింటాలు కందిపప్పునకు రూ.20 వేల ధర పలికింది. తర్వాత జిల్లాలో రైతులు కంది పంట విస్తీర్ణం పెంచడంతో మళ్లీ సాధారణ స్థాయికి వచ్చాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో సైతం కందిపప్పు ధరలు భారీగా పెరిగాయి.

పెరగని సాగు

తాండూరు కందిపప్పుకు భౌగోళిక గుర్తింపు లభించింది. ఈనేపథ్యంలో పంట సాగు విస్తీర్ణం పెరగాలి. కానీ ప్రస్తుత వానాకాలం సీజన్‌లోనూ రైతులు ఈ పంట వైపు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న కంది ప్రస్తుతం రెండో జాబితాలోకి చేరింది. వాణిజ్య పంట పత్తికే ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

క్లుప్తంగా

హైఓల్టేజీతో కాలిన కంప్యూటర్లు

యాలాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పలు ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. ఎమ్మార్సీ కార్యాలయానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు రోజులుగా సరఫరాలో అంతరాయం కలుగుతోందని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. కాగా సరఫరాలో హై ఓల్టేజీ కారణంగా కంప్యూటర్‌తో పాటు ప్రింటర్, ఫ్యాన్లు కాలిపోయాయని సిబ్బంది తెలిపారు. ఈ విషయమై ట్రాన్స్‌కో లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలో సమస్యను పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

బావిలోపడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి



మోమిన్‌పేటలోని కేసారంలో బావిలో పడిన ట్రాక్టరు

మోమిన్‌పేట: ప్రమాదవశాత్తు బావిలో ట్రాక్టర్ పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందారు. మోమిన్‌పేటలో గురువారం సాయంత్రం చోటు చేసుకొన్న ఘటన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన గుజ్జరి సుధాకర్ (34) ఆదే గ్రామానికి చెందిన గుజ్జరి మైపాల్‌కు చెందిన ట్రాక్టరుపై డ్రైవరుగా పని చేస్తున్నాడు. కాగా బొజ్జ అనందం పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. పొలం పక్కనే పాడు బడిన బావి ఉండటంతో ప్రమాదవశాత్తు ట్రాక్టరు అందులో పడిపోయింది. డ్రైవరుకు గాయాలు కావడంతో సదాశివపేటకు చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బల్వంత్ మృతదేహం

మోమిన్‌పేట: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మోమిన్‌పేటలో శుక్రవారం చోటు చేసుకొంది. చంద్రాయన్‌పల్లికి చెందిన పిచ్చకుంట్ల బల్వంత్(26), భవానీ దంపతులు. బల్వంత్ ప్రతి రోజు మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. గురువారం ఉదయం కూడా మద్యం సేవించి భార్యతో గొడవ పడ్డాడు. ఆ తరువాత బావిలో స్నానం చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. దీంతో భార్య అంతటా వెతకగా ఓ బావి వద్ద బీడీలు, డబ్బులు కనిపించాయి. బావిలోకి చూడగా అందులో ఉన్నాడని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. కేతిరెడ్డిపల్లికి చెందిన కావలి మల్లేశ్ (27) శృతి దంపతులు. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం శృతి గర్భవతి. అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 9న ఆస్పత్రికి వెళ్లింది. ఆస్పత్రిలో చూపించుకుని పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. గురువారం సాయంత్రం మల్లేశ్ భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. ఇంటికి రాకుండా తన భార్య పుట్టింటిలోనే ఉందని మనస్తాపం చెంది రాత్రి వేళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం చుట్టపక్కల వాళ్లు గమనించి భార్యకు, పోలీసులకు చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నాణ్యత డొల్ల.. నిధులు గుల్ల

వెచ్చిస్తున్న రూ.కోట్లాది నిధులు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు
- ఫలితంగా మూణ్నాళ్ల ముచ్చటగా రహదారులు



తాండూరు పట్టణంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో వేస్తున్న సీసీ రోడ్లు

తాండూరు: రూ.కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా తాండూరు నియోజకవర్గంలో రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాణ్యత ప్రమాణాలతో రోడ్లను వేయాల్సిన కాంట్రాక్టర్లు నామ్‌కే వాస్తేకే వేసి బిల్లులు స్వాహా చేస్తున్నారు. దీంతో కొన్ని రోజులకే గుంతలమయంగా మారుతుండటమే ఇందుకు నిదర్శనం.

తాండూరు నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. నిధులు వరదలా వస్తున్నా రోడ్లు పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో సుమారు రూ.160కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఐదేళ్ల క్రితం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తాండూరు పట్టణానికి రూ.78కోట్లతో బైపాస్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వం నుంచి ప్రత్యేక అభివృద్ధి కింద రూ.134 కోట్లు మంజూరు చేయించారు. అందులో రూ.30కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరోవైపు తాండూరు డివిజన్ పరిధిలో ఉన్న రోడ్ల మరమ్మతులకు సైతం రూ.40 కోట్లు కేటాయించారు. జీవన్గీ కాగ్నా బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులకు రూ.1.50కోట్లు కేటాయించారు.

పర్యవేక్షణ లేకే..

తాండూరు ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులకు అధికారుల పర్యవేక్షణ కరువైంది. కాంట్రాక్టర్‌లు నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు వేసే సమయంలో సంబంధిత శాఖ ఇంజినీరు తప్పని సరిగా ఉండి పనులు పర్యవేక్షించాలి. కానీ ఏ ఒక్కరూ అందుబాటులో ఉండటం లేదు. కాంట్రాక్టర్లకు అధికార పార్టీ నేత అండదండలు ఉండటంతో పాత పనులపైనే పూతలు వేసి బిల్లులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆర్‌అండ్‌బీలో పోస్టులు ఖాళీ..

జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల రోడ్లు, భవనాల శాఖ రెండు శాఖలుగా విడిపోయాయి. అయితే రోడ్ల శాఖ అధికారులనే భవనాల శాఖకు ఇన్‌చార్జిగా నియమించారు. జిల్లాలో ముగ్గురు డీఈఈలు పూర్తి స్థాయిలో ఉన్న జూనియర్ ఇంజినీర్‌లు మాత్రం 12 మందికి గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో రోడ్ల పనులపై పర్యవేక్షణ లేకుండాపోయింది.



శ్రీవారి ఉత్సవమూర్తులు



12 నుంచి వేంకటేశ్వరుడి పవిత్రోత్సవాలు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించే పవిత్రోత్సవాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. రెండేళ్లకు ఒకసారి కొడంగల్‌లో శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే ఇక్కడ కూడా వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు చేస్తారు. జూలై 12న రాత్రి 7గంటల నుంచి ఆచార్య వచణం, సేనాధిపతి ఉత్సవం, మత్సంగ్రహణం, అంకురార్పన వేదారంభం, 13న ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శత కలశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ట, పవిత్ర ప్రతిష్ట, రాత్రి 7గంటలకు కుంభవాహన, విశేష హోమం నిర్వహిస్తారు. 14న ఉదయం 9గంటలకు విశేష హోమం పవిత్ర సమర్పణ, రాత్రి 8 గంటలకు ప్రత్యేక పూజలు, 15వ తేదీ ఉదయం 9 గంటలకు విశేష హోమాలు, రాత్రి 7గంటలకు పవిత్రోత్సవ మహా పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణం, ప్రోక్షణ కార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

దంపతుల అదృశ్యం



సంతోష్/ సంధ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: దంపతులిద్దరూ అదృశ్యమయ్యారు. భానూర్-బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన సంధ్య వివాహం.. చేవెళ్ల మండలం కొరికుంట్ల గ్రామానికి సంతోష్‌తో జరిగింది. సంతోష్ సదాశివపేట ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వారంరోజుల క్రితం సంధ్య తల్లిగారింటికి వచ్చింది. బంధువుల వద్ద శుభకార్యం ఉండటంతో సంతోష్ కూడా అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో 15న సాయంత్రం దంపతులిద్దరూ బైక్‌పై వెళ్లారు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో లక్ష్మి తన కూతురు, అల్లుడుకు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. తెలిసినా వారికి ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. తన కూతురు, అల్లుడు అదృశ్యం అయ్యారంటూ లక్ష్మి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు



మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

యాలాల: మండల పరిధిలోని బాగాయిపల్లి సమీపంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరంతా శుక్రవారం కొద్ది సేపు వృథా అయ్యాయి. బాగాయిపల్లి చౌరస్తాలో శుక్రవారం మధ్యాహ్నం పైప్‌లైన్ లీకేజీ కావడంతో సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే జేసీబీ సహాయంతో మరమ్మతు కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు మరమ్మతు పనులు కొనసాగాయి. పగిడియాల-రాస్నం మార్గంలో గల భగీరథ ట్యాంకు నుంచి దిగువన ఉన్న పగిడియాల, బాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట, సంగాయగుట్టతండా తదితర గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. మర మ్మతులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో ప్రగతి పరుగులు

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి



పాల్గొన్న మహిళలు, లబ్ధిదారులు

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక రాష్ట్రంలో మున్సిపాలిటీలు ప్రగతి బాటపట్టాయని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని తేజా ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఆర్డీఓ విజయ కుమారి, చైర్‌పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ శరత్ చంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో మున్సిపాలిటీలకు నిధులు రాక అభివృద్ధి జరిగేది కాదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉండటం కూడా మున్సిపాలిటీలకు వరంగా మారిందన్నారు. హరితహారం కార్యక్రమంతో పట్టణాలు పచ్చగా కనిపిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు కూడా అభివృద్ధి బాటలో నడుస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల శ్రమతోనే..

మున్సిపల్ కార్మికుల శ్రమ వల్లే స్వచ్ఛ మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వారి సేవలు మరువలేనివని అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిరంతర పర్యవేక్షణతోనే అభివృద్ధి సాధ్యమవుతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రగతిలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ మంజుల రమేశ్, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగంలు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కూడా ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కౌన్సిలర్లు, కార్మికులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ సిబ్బంది పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లకు ఉత్తమ సేవా ప్రశంస పత్రాలను అందించారు.

గిరిజన బంధు ఇవ్వాల్సిందే



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అనంతగిరి: గిరిజనులకు సైతం 'బంధు' ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి డబుల్‌బెడ్రూం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. వెంటనే గిరిజన బంధు ఇస్తే ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, మహేష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసంచేయడంతో..

యువకుడిపై పీఎస్‌లో యువతి ఫిర్యాదు

తాండూరు రూరల్: తనను నమ్మించి, మోసం చేశాడని ఓ యువతి కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గౌతాపూర్‌కు చెందిన జగదీశ్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. ఈ విషయమై గ్రామ పెద్దలు పంచాయతీ పెట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో యువతి ఫిర్యాదు మేరకు జగదీష్‌పై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

సబ్సిడీ యూరియా పట్టివేత



పట్టుబడిన వాహనంలో యూరియా బస్తాలు

వాహనం సీజ్

కేశంపేట: రైతులకు సబ్సిడీపై అందించాల్సిన యూరియాను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకోని కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలో కానిస్టేబుల్ రవి, హోంగార్డు రవి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బొలెరో వాహనంలో యూరియా తరలిస్తుండగా గమనించి పట్టుకున్నారు. వాహనంలో 45 కిలోల యూరియా బస్తాలు 60 ఉన్నట్లు వారు తెలిపారు. యూరియాకు సంబంధిన సరైన పత్రాలు లేవని కేశంపేటలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం నుంచి చేవెళ్ల దగ్గరలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నట్ల డ్రైవర్ మల్లేశ్ తెలిపినట్లు వారు తెలిపారు. ఆగ్రోరైతుసేవ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా ఉన్న మంచె శ్రీశైలం ఈ యూరియా బస్తాలను తరలించినట్లు వారు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పాండయ్య తెలిపారు.

ఎర్రమట్టి తరలిస్తున్న రెండు టిప్పర్ల సీజ్

మర్పల్లి: అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను, ట్రాక్టర్‌ను తహసీల్దార్ పట్టుకుని సీజ్ చేశారు. పట్లూర్‌లో ఎర్రమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తహసీల్దార్ శ్రీధర్ గ్రామానికి వెళ్లి ఎర్రమట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వాహనాలను పోలీసులకు అప్పగించారు.

ప్రత్యేక ప్రణాళికతో పట్టణాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: సీఎం కేసీఆర్ పట్టణాలను ఎంతో అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణాలు అన్ని విధాల అభివృద్ధి బాట పట్టాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రజలు పట్టణాల్లో పనులు లేక నగరాలకు వలస వెళ్లేవారని అన్నారు. కానీ నేడు పట్టణాలు నగరాలుగా అభివృద్ధి చెందుతూ అన్ని సౌకర్యాలను ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. పరిగి పట్టణానికి ప్రత్యేక నిధులను తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, కమిషనర్ శ్రీనివాసన్ కౌన్సిలర్లు రవీందర్, అర్చన, కృష్ణ, నాగేశ్వర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కొడంగల్ ముందంజ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

- అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- మా భూములు సైతం ఇచ్చాం: మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: పట్టణం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత అభివృద్ధిలో ముందంజలో ఉందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం చేరుకొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం అందినట్లు తెలిపారు. ఆసరా ఫించన్లు, ఒంటరి మహిళలకు ఫించన్లు, మహిళలకు 50శాతం రిజర్వేషన్, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఆసరా ఫించన్లు, కేసీఆర్ కిట్టు పథకాలతో పేదలందరికీ మేలు చేసినట్లు చెప్పారు. వైకుంఠ ధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించినట్లు చెప్పారు. మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేసి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తమ సొంత భూములు ఇచ్చినట్లు చెప్పారు. పట్టణంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లకు తమ కుటుంబ సభ్యులు భూమి ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, మార్కెట్ యార్డు తదితర భవనాలకు భూములను ధారాదత్తం చేసిన ఘనంగా తమకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ప్రత్యేకాధికారి కృష్ణన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు మధుసూదన్‌రావ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, మాజీ సర్పంచు రమేష్‌బాబు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల కోసం రూ.16.34 కోట్లు మంజూరు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ82 కాలువ నిర్మాణంలో ఆమనగల్లు, మాడ్గుల, మండలాలలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం రూ.16.34 కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఫైనాన్స్ డిపార్టమెంట్ ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీడీ అకౌంట్‌లో జమ అయినట్లు, ఒకటి రెండు రోజులలో రైతుల ఖాతాలలో జమ చేస్తారని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడని చెప్పారు. కేఎల్‌ఐ డీ 82 కాలువ నిర్మాణంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ, కల్వకుర్తి మండలాల రైతులకు సంబంధించి ఇప్పటికే రూ.26 కోట్లు అందించామన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల రైతులకు ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మనుగడ లేదని ఆయన చెప్పారు. కేసీఆర్ పాలన దేశ ప్రజలు కోరుకుంటున్నారని, దేశంలోని వివిధ రాష్ట్రాలలో బీఆర్‌ఎస్‌కు మంచి మద్దతు లభిస్తుందని ఆయన వివరించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17న గిరిజన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఆమనగల్లులో రూ. 2 కోట్లతో నిర్మించే గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరీదేవి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ జ్యోతి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ పాల్గొన్నారు.